
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
శుక్రవారం 24 అక్టోబరు 2025



ప్రీ-టెస్ట్‌లో కచ్చితత్వం తప్పనిసరి

జనాభా లెక్కల ముందుస్తు కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహానంది మండలంలో పైలట్ ప్రాతిపదికన జరగనున్న జనాభా లెక్కల ప్రీ-టెస్ట్ కార్యకలాపాల్లో కచ్చితత్వం పాటించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 2027 జనాభా లెక్కల ముందస్తు సెన్సిటైజేషన్ కార్యక్రమాలపై జిల్లా స్థాయి శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2027 జనాభా లెక్కల ప్రీ-టెస్ట్ కార్యకలాపాలు అత్యంత ప్రాధాన్యమైనవని, సెన్సస్ ప్రక్రియలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు సంపూర్ణ శిక్షణ పొంది ప్రతి ఇంటి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఈ పనిని సమయపాలనతో నిర్దిష్ట విధానంలో పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల 10 నుంచి 30 వరకు మొదటి దశగా ఇళ్ల జాబితా, ప్రాథమిక సర్వే నిర్వహించనున్నట్లు తెలియజేసి ఈ దశకు అవసరమైన డిజిటల్ అసిస్టెంట్లకు ముందస్తు శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్స్ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ సుప్రజ్, జిల్లా గణాంక అధికారి పోతుల మోహన రమణ, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ మాధురి పాల్గొని సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రీ టెస్ట్ కార్యకలాపాల లక్ష్యాలు, విధానాలు, సమయపాలన, డేటా సేకరణలో అనుసరించాల్సిన ప్రమాణాలపై చర్చించారు. అనంతరం గణాంక అధికారి మాట్లాడుతూ.. సెన్సస్ కార్యకలాపాలు పూర్తిగా డిజిటల్ విధానంలో జరగనున్నాయని అందుకోసం ప్రత్యేక మొబైల్ యాప్‌లు, డేటా ఎంట్రీ టూల్స్ వినియోగంపై అధికారులు డీలింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించామని తెలిపారు. ఈ సమావేశం చివర్లో కలెక్టర్ జిల్లా అధికారులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించి క్షేత్రస్థాయి అమలు పద్ధతులు, సాంకేతిక సమస్యలు, పరిష్కారాలపై చర్చించారు.

వీడని వర్షం అపార నష్టం



కలుగొట్లపల్లె వక్కిలేరు వంతెనపై ప్రవహిస్తున్న వరద

చాగలమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. చాగలమర్రి మండలంలోని గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. అడ్డవాగు, వక్కిలేరు పొంగి ప్రవహించాయి. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనపై వరద ప్రవహించడంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించాయి. నేలంపాడు, గొట్లూరు గ్రామాల సమీపంలో పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. రైతులు సాగు చేసిన బెండ, మినుము, మొక్కజొన్న, వరి, జూట్ పంటలు దెబ్బతిని రైతులకు తీరని నష్టం వాటిల్లింది. రెండు వేల ఎకరాల దాకా పంటలు నీటమునిగి రైతులను కోలుకోలేని విధంగా తుఫాన్ దెబ్బతీసింది. పొలాల వైపు వ్యవసాయ శాఖ కన్నెత్తి కూడా చూడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గొట్లూరులో నీట మునిగిన బెండ పంట



పెద్దబోదనం సర్వీసు రహదారిలో తడిసిన మొక్కజొన్న ధాన్యం



వర్షానికి తడిసి మొలకలెత్తిన మొక్కజొన్న ధాన్యం

సర్వీసు రోడ్ల మీద..

మండలంలోని పెద్దబోదనం, చిన్నబోదనం, మద్దూరు, చాగలమర్రి, ముత్యాలపాడు, గొడిగనూరు, మూడురాళ్లపల్లెతో పాటు ఆయా గ్రామాల పరిధిలోని రోడ్ల మీద మొక్కజొన్న దిగుబడులను ఆరబెట్టుకున్నారు. అకాల వర్షంతో రైతన్నకు కంటికి కునుకులేకుండా చేస్తోంది. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఆరబెట్టుకున్న మొక్కజొన్నలు తడిచి మొలకెత్తి తీరని నష్టం కలిగిస్తున్నాయి. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కూలిన మట్టి మిద్దె



అప్పలాపురంలో కూలిన మట్టి మిద్దె

బనగానపల్లె: భారీ వర్షాలకు మండలం అప్పలాపురంలో మట్టి మిద్దె కూలింది. గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌బీ తన కుటుంబ సభ్యులతో మట్టిమిద్దెలో గురువారం తెల్లవా రుజామున నిద్రిస్తుండగా మట్టి పడింది. వెంటనే మేల్కొని కుటుంబ సభ్యులంతా బయటకు వచ్చారు. దీంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో సామగ్రితో పాటు బియ్యం, బట్టలు మట్టి కింద కూరుకుపోయాయి. తనకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని తహసీల్దారు నారాయణరెడ్డికి బాధితురాలు ఖాదర్‌బీ వినతిపత్రం సమర్పించారు.

- పొంగిన వాగులు, వంకలు
- స్తంభించిన రాకపోకలు
- నీట మునిగిన పొలాలు
- తడిసిన మొక్కజొన్న
- ఆదుకోవాలంటున్న రైతన్నలు

నంద్యాలలో 29.6 మి.మీ వర్షపాతం

నంద్యాల ఎడ్యుకేషన్: పట్టణంలో అత్యధికంగా 29.6ఎంఎం వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా ప్యాపిలి మండలంలో 2.8ఎంఎం వర్షపాతం నమోదైంది. బండిఆత్మకూరు 29.0, నంద్యాల రూరల్ 28.4, ఆళ్లగడ్డ 23.4, గోస్పాడు 22.4, బేతంచెర్ల 22.4, దొర్నిపాడే 20.6, చాగలమర్రి 20.2, రుద్రవరం 19.4, శిరివెళ్ల 17.2, కొలిమిగుండ్ల 17.0, పాణ్యం 16.6, కోవెలకుంట్ల 16.2, ఉయ్యాలవాడ 15.2, వెలుగోడు 14.4, గడివేముల 13.2, సంజామల 12.6, మహానంది 11.4, కొత్తపల్లె 10.8, బనగానపల్లె 10.4, అవుకు 9.4, మిడ్తూరు 8.4, శ్రీశైలం 5.4, పాములపాడు 5.4, నందికొట్కూరు 5.0, పగిడ్యాల 4.8, డోన్ 4.2, జూపాడుబంగ్లా 3.6, ఆత్మకూరు 3.6, ఆత్మకూరు 3.6ఎంఎం వర్షపాతం నమోదైంది. అల్పపీడన ప్రభావంతో రానున్న ఐదురోజుల పాటు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ సంస్థ వెల్లడించింది.

నాణ్యమైన భోజనం అందించండి

- విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయండి
- కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్
- పలు పాఠశాలల్లో తనిఖీలు



బాలుర పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న శామ్యూల్

చాగలమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ ఆదేశించారు. గురువారం చాగల మర్రిలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అసైన్ మెంట్ పుస్తకాలను పరిశీలించి వీలైనంత త్వరగా కరెక్షన్ పూర్తిచేసి మార్కులు నమోదు చేయాలని ఆదేశించారు. రాబోయే సమ్మెటివ్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని అన్నారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, హెచ్ఎంలు జీవయ్య, శివలక్ష్మీ, ఎస్‌వో స్వప్న, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను సాంకేతికంగా తీర్చిదిద్దాలి

మంత్రి ఎన్ఎండీ ఫరూక్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సాంకేతికంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, డీఈవో జనార్దన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ టెక్నాలజీని విద్యార్థులకు సబ్జెక్టు వారీగా బోధించాలని, వారికి కనీస కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని అన్నారు. త్వరలో స్థానిక ఉర్దూ భవన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ తరపున కంప్యూటర్ సెంటర్ ఏర్పాటుచేసి మంచి ఫ్యాకల్టీతో ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులు ప్రారంభిస్తామన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన మంత్రి

మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా, నాణ్యతలో లోపాలున్నా ఉపేక్షించమన్నారు. ఈ కార్యక్రమంలో సీఈడీఎమ్ డైరక్టర్ యాకూబ్‌బాషా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఉర్దూ అస్మదుద్దీన్, హెచ్ఎం అసదుల్లా తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న హుండీ లెక్కింపు


35 రోజుల్లో రూ.4,08,69,958 ఆదాయం



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్న హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 35 రోజులుగా భక్తులు స్వామి, అమ్మవార్లకు మొక్కులు, కానుకల రూపంలో రూ.4,08,69,958 ఆదాయంగా వచ్చినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. హుండీ ఆదాయంలో అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.11,39,376 ఉన్నట్లు తెలిపారు. 639.500 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కేజీల 480 గ్రాముల వెండితోపాటు 363 యూఎస్ఏ డాలర్లు, 30 యూఏఈ దీర్హమ్స్, 01 కువైట్ దినార్, 05 సౌదీ రియాల్స్, 01 ఖతార్ రియల్స్, 62 సింగపూర్ డాలర్లు, 40 కెనడా డాలర్లు, 20 ఇంగ్లాండ్ పౌండ్స్, 27 మలేషియా రింగెట్స్, 200 ఓమాన్ బైసా, 6,20,000 కొరియా ఓన్స్ మొదలగు విదేశీ కరెన్సీని హుండీ ద్వారా స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించారు. చంద్రావతి కల్యాణ మండపంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో ఆలయ అధికారులు, పర్యవేక్షకులతో పాటు శివసేవకులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

ముంచేశాయి..



చెట్టుపై తెల్లబంగారంలా మెరిసిపోతున్న పత్తి వర్షాలకు నేలపాలవుతుందని రైతుల ఆవేదన

పత్తిని సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధిక వర్షాలు నిలువునా ముంచేశాయి. చేతికొచ్చిన పత్తి చెట్టుపైనే నేల రాలిపోయింది. జిల్లాలో ఎకరాకు సగటు దిగుబడి ఎనిమిది క్వింటాళ్లు వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తల అంచనా. మూడు నాలుగు క్వింటాళ్లు కూడా దిగుబడి కూడా రాని పరిస్థితి. ఎకరాకు ఐదు క్వింటాళ్లకు పైగా దిగుబడి కోల్పోయారు. ఈలెక్కన పత్తి రైతులు రూ.2,250 కోట్లకు పైగా నష్టాన్ని మూటగట్టుకోవాల్సి వస్తుంది. ధర లేక ఉల్లి రైతులు చితికిపోతే ప్రభుత్వం అండగా నిలిచింది. అదే తరహాలో పత్తి రైతులకు కూడా అండగా నిలవాలని వ్యవసాయ నిపుణులు కోరుతున్నారు. తాజాగా పత్తి రైతుల మెడపై అల్పపీడనం కత్తి వేలాడుతుంది. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- అల్పపీడనం ప్రభావంతో అధిక వర్షాలు
- నేల పాలవుతున్న తెల్లబంగారం
- ఎకరాకు సగటు దిగుబడి అంచనా 8 క్వింటాళ్లు
- మూడు, నాలుగు క్వింటాళ్లు కూడా చేతికందని వైనం
- భారీగా నష్టపోయిన అన్నదాతలు





వర్షాలకు తడిసి చెట్టుపైనే మొలకలు వస్తున్న పత్తి

కర్నూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పత్తి సాగులో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో 4.02 లక్షల హెక్టార్ల (10.05 లక్షల ఎకరాలు)లో పత్తి సాగు చేశారని ప్రభుత్వం అంచనా వేసింది. జిల్లాలో ఒక్కటే 2.24లక్షల హెక్టార్లు (5.6లక్షల ఎకరాలు) సాగు చేశారు. వర్షాధారం కింద ఎకరాకు సగటున రూ.45-50 వేలు పెట్టుబడి పెట్టామని రైతులు తెలిపారు. సేద్యం ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కలుపులు ఇలా వివిధ రూపాల్లో రూ.2,500కోట్లకు పైగా మట్టి పోశారు. మొలకెత్తి పత్తి పచ్చగా ఏపుగా పెరుగుతుంటే కష్టాలు తీరుతాయని సంబరపడ్డారు. పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు నిలువునా ముంచెత్తాయి. రైతులు ఊహించని తీవ్రనష్టం చవిచూశారు. ఏ రైతును కదిపినా కన్నీటి కష్టాలు ఏకరువు పెడుతున్నారు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తెలంగాణ రాష్ట్రానికి వలస కట్టారు.

గతేడాదితో పోలిస్తే..

జిల్లాలో గతేడాది ఎకరాకు సగటున 11 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈఏడాది సగటున ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. భారీ వర్షాలతో చెట్టుపై పత్తి చేతికి రాకుండానే నేలపాలైంది. ఎకరాకు సగటున మూడు నాలుగు క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని వ్యవసాయ నిపుణులు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక కూడా పంపినట్లు సమాచారం. గతేడాదితో పోలిస్తే ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లు చొప్పున 5.60 లక్షల ఎకరాలకు 25 లక్షల క్వింటాళ్లకు పైగా దిగుబడి కోల్పోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మద్దతు ధర రూ.8,110లు ప్రకారం లెక్కిస్తే సుమారుగా రూ.రెండు వేల కోట్లకు పైగా విలువైన పత్తి దిగుబడులు రైతులు కోల్పోవాల్సి వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్త ఒకరు పేర్కొన్నారు.

మిగతా 7వ పేజీలో



ఆదోని మండలం మదిరె గ్రామంలో పత్తి పంటను పరిశీలిస్తున్న నంద్యాల ఆర్ఏఆర్ఎస్, బనవాసి కేవీకే శాస్త్రవేత్తలు (ఫైల్)

బీటలువారిన
జీడీపీ మట్టి కట్ట

- వర్షం వల్ల రోడ్డు మీదికి కొట్టుకొస్తున్న మట్టి
- నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలు
- కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చిన జీడీపీ అధికారులు



క్రస్ట్‌గేట్ల దగ్గర భారీగా కోతకు గురైన జీడీపీ మట్టి కట్ట

గోనెగండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టులో కొత్తగా నిర్మించిన మట్ట కట్ట గత నెలలో కురిసిన వర్షాలకు కోతకు గురై కొంత కుంగిపోయింది, కొంత కొట్టుకుపోయింది. ఈ మట్టి.. రోడ్డుకు అడ్డంగా చేరుతుండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కట్ట కోతకు గురై మాసాలు గడుస్తున్నా చర్యలు మాత్రమ శూన్యం. ఇటీవల ఎమ్మిగనూరుకు చెందిన ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మట్టి కట్ట పక్కనే ఉన్న క్రస్ట్‌గేట్ల దగ్గర నీళ్లలో జారిపడి మృతిచెందారు. వారం రోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు మట్టి కట్ట ఎక్కుతూ జారి కింద పడ్డారు. వారికి ఏ ప్రమాదం జరగలేదు. ఇలా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మట్టి కట్ట నిర్మాణంలో పనుల నాణ్యతపై ప్రజలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి ప్రాజెక్టు నుంచి పిల్లిగుండ్ల సమీపం వరకు చాలా చోట్ల మట్టికట్ట పగుళ్లు వచ్చాయి. నాణ్యత లేని పనులతో ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు, ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 4టీఎంసీల నీరు ఉంది. అనుకోని ప్రమాదాలు ఏమైనా జరిగే ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటించకపోతే ఇరిగేషన్ అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కట్ట నిర్మాణంలో గ్రౌండ్ లెవెల్‌లో 8 నుంచి 18 మీటర్లు, టాప్ లెవెల్‌లో 6 మీటర్ల వెడల్పు, 4.313 కిమీ పొడవున మట్టి కట్ట నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. కోతకు గురైన ప్రాంతంలో మరోసారి నాణ్యంగా పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో వైసీపీ నాయకులు, అధికారులు పనుల్లో కమీషన్ కోసం చేయి చాచడం కారణంగానే నాణ్యత లోపించిందనే ఆరోపణలు ఉన్నాయి. చాలాచోట్ల మట్టి కట్ట కోతకు గురైంది. ఇప్పటికైనా జీడీపీ ఇరిగేషన్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని పగుళ్లు బారిన చోట నూతనంగా పనులు చేయించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నోటీసులు ఇచ్చాం

మట్టి కట్ట కోతకు గురికావడంతో పనులు చేసిన కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చినట్లు జీడీపీ ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. ప్రాజెక్టు మట్టి కట్టకు లూజ్ మట్టిని వేయడం, సరైన పద్ధతిలో రోల్ చేయక పోవడంతో వర్షం నీటికి కట్ట కోతకు గురైందని అన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి లూజ్ మట్టిని అంతా తీయించి కొత్తగా మట్టిని వేసి రోలర్‌లో గట్టి పడేలా పనులు చేయిస్తాం. నెల రోజుల లోపు పనులు పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ తెలిపినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు.

పోలియో రహితం

- జిల్లాలో చివరి కేసు 2003లో నమోదు
- ఏటా 3.48 లక్షల మంది పిల్లలకు చుక్కల మందు
- నేడు ప్రపంచ పోలియో నివారణ దినం

ఒకప్పుడు పోలియో అంటే భయపడేవారు. ఆ రోజులు పోయాయి. పోలియో రహిత దేశాన్ని నిర్మించాలనే లక్ష్యానికి మనం చేరుకున్నాం. ప్రపంచ వ్యాప్తంగా పోలియోపై చేసిన ప్రయోగాలు ఫలించాయి. 1968లో అమెరికాకు చెందిన శాస్త్రవేత్త జోనక్ సాల్క్ పోలియో నిర్మూలన టీకాను కనుగొన్నారు. ఇది సత్ఫలితాలు ఇచ్చింది. 1995లో మన దేశంలో పోలియో వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. దీనికి అనుగుణంగా ఏడాదికి రెండు సార్లు పోలియో చుక్కలను చిన్నారులకు వేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులు ప్రజలు సహకారంతో ఒక ఉద్యమంగా పోలియో నిర్మూలన కార్యక్రమాలు జరపడంతో కర్నూలుకు పోలియో రహిత జిల్లాగా గుర్తింపు లభించింది. ఈ ఏడాది 'పోలియోను అంతం చేయండి.. ప్రతి బిడ్డ ప్రతి టీకా.. ప్రతి చోటా' అన్న నినాదాన్ని ఇచ్చింది. పోలియో నిర్మూలనా టీకాను కనుగొన్న అక్టోబరు 24న ప్రపంచ పోలియో నివారణ దినం జరుపుతున్నారు.



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 0-5 సంవత్సరాలలోపు 3.46 లక్షల మంది పిల్లలకు ఏటా పోలియో చుక్కలు వేస్తున్నారు. 2024 సంవత్సరంలో పల్స్ పోలియో కార్యక్రమాలు 100 శాతం జిల్లా ఇమ్యూనైజేషన్ శాఖ పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో సైతం 3వేలపై పోలియో శిబిరాలను ఏర్పాటు చేసి 12వేల మంది సిబ్బంది సహకారంతో చుక్కల మందును వేశారు. ఇందుకోసం పల్స్ పోలియో కోసం ఉమ్మడి జిల్లాలో రూ.45 లక్షలు 87 పీహెచ్‌సీలో ఖర్చు పెట్టేవారు. ప్రస్తుతం ఆదునికంగా పోలియో నివారణకు రొటీన్ ఇమ్యూనైజేషన్‌లో భాగంగా వారంలో ప్రతి బుధ, శనివారాల్లో సచివాలయాలు, ఆరోగ్య మందిరాలు, పీహెచ్‌సీల్లో రెగ్యులర్‌లుగా 5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2003లో..

ఉమ్మడి జిల్లాలో 2003లో గూళ్యంలో ఓ బాలునికి పోలియో కేసు నమోదైంది. ఇదే చివరి కేసు. ఆ తర్వాత ఎలాంటి కేసు నమోదు కాలేదు. ఇండియాలో 2011లో చివరి పోలియో కేసు నమోదైంది. 2014 మార్చి 27న పోలియో సర్టిఫికేషన్ కమిషన్ ద్వారా భారత దేశం పోలియో రహితంగా ప్రకటించింది. అయితే మన పక్కనున్న బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లలో పోలియో కేసులు నమోదు కావడం వల్ల అనుమానిత జిల్లాలో కేంద్ర ప్రభుత్వం పల్స్ పోలియో చుక్కల మందు కార్యక్రమాన్ని ఏటా ప్రత్యేకంగా నిర్వహిస్తుంది.



పోలియోను నివారించాం



జిల్లాలో పోలియో మహమ్మారిని నివారించగలిగాం. 2003 తర్వాత జిల్లాలో ఎలాంటి పోలియో కేసు నమోదు కాలేదు. 2024లో రెగ్యులర్‌గా వేసే పోలియో వ్యాక్సిన్‌ను వంద శాతం పూర్తి చేశాం. దీని వల్ల జిల్లాను పోలియో రహితంగా తయారు చేశాం.

– డాక్టర్ పి. ఉమ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, కర్నూలు

రాష్ట్రంలో 2008లో చివరి కేసు



రాష్ట్రంలో 2008లో పోలియో వైరస్ కేసు నమోదైంది. ఆ తర్వాత పల్స్ పోలియో కాకుండా రొటీన్ పోలియో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. పోలియో వ్యాక్సిన్‌ను పిల్లలు పుట్టిన 6 వారాలు, 10 వారాలు, 15 నుంచి 24 నెలలకొకసారి బూస్టర్, 5 సంవత్సరాల్లో బూస్టర్‌డోస్ వేయించాలి. దీంతో పాటు పోలియో వ్యాక్సిన్ తహాలోనే పోలియో ఇంజెక్షన్‌ను 6 వారాలు, 14 వారాల్లో వేయించాలి.

● డా.బి. విజయానంద బాబు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, చిన్న పిల్లల విభాగం, జీజీహెచ్, కర్నూలు

'కర్నూలు ఉత్సవ్'ను వైభవంగా నిర్వహించాలి

డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ఖ్యాతిని నలుదిక్కులా చాటిచెప్పేలా 'కర్నూలు ఉత్సవ్-2025'ను వైభవంగా నిర్వహించాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య, సభ్యులు మహమ్మద్‌మియా, కేవీ రమణ డీఐజీని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. టీజీవీ కళాక్షేత్రం, ఏపీ నాటక అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక భాషా వికాస సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న కర్నూలు ఉత్సవ్ వివరాలను వారు డీఐజీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఉత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ వారం రోజుల పాటూ కొనసాగే ఈ వేడుకలను జయప్రదం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. చిన్నతనం నుంచి తనకు పౌరాణిక నాటకాలు అంటే ఇష్టమని డీఐజీ గుర్తు చేసుకున్నారు. తెలుగు భాషతోపాటూ, కళారంగాన్ని భావితరాల కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉందన్నారు. జిల్లా స్థాయిలో 40 నాటక సమాజాల వారు కర్నూలు ఉత్సవ్‌లో ఏర్పాటు చేసిన పౌరాణిక ఏకాంకిక నాటక పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఉత్సవాలకు తాను హాజరావుతానని ఆయన కళాకారులకు హామీ ఇచ్చారు.



డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న పత్తి ఓబులయ్య, కళాక్షేత్రం సభ్యులు

డిజిటల్ కార్డులు..
అనేక లాభాలు..!

- 60 ఏళ్లు దాటిన వృద్ధులకు అందించేందుకు కసరత్తు
- సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు
- కేంద్ర, రాష్ట్ర పథకాల్లో ప్రాధాన్యం





కర్నూలు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లకు అందించే డిజిటల్ కార్డులతో అనేక లాభాలు ఉన్నాయి. ఈ కార్డులను అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. 60 ఏళ్లు దాటిన వృద్ధులందరికి వీటిని అందించే కసత్తు చేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఈకార్డు పొందిన వయో వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లో టికెట్ రాయితీ పొందేందుకు వీలుంటుంది.

కార్డు పొందాలంటే ఇలా..

డిజిటల్ కార్డు కావాలనుకునే వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయంలో కూడా అప్లికేషన్ అందజేయవచ్చు. దరఖాస్తు సమయంలో పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రక్తం గ్రూపు తదితర పత్రాలివ్వాలి. దరఖాస్తు చేసిన వారం, పది రోజుల్లో డిజిటల్ కార్డును పొందవచ్చు 60 ఏళ్లు దాటిన పురుషుడు, 58 ఏళ్లు దాటిన మహిళలు అర్హులు.

ప్రభుత్వ ప్రయోజనాలు ఇలా..

పిల్లల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడి వారిని ప్రయోజకులు చేసిన చాలా మంది తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతున్నారు. పిల్లలు, తల్లిదండ్రుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు. పాశ్చాత్య ధోరణి, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడంతో అనుబంధాల మధ్య మనస్పర్థలు, తేడాలతో విడిపోవడం లాంటి పరిస్థితుల్లో వయోవృద్ధుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టాన్ని తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వారి కోసం సీనియర్ సిటిజన్‌డిజిటల్ కార్డుల్ని అందిస్తోంది. వీటి ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు వెసులుబాటు కల్పించింది.

- డిజిటల్ కార్డుంటే ఆర్టీసీ బస్సుల్లో టికెట్‌పై 25 శాతం రాయితీ, దూర ప్రాంతాల బస్సులు మినహాయిస్తే ఇతర అన్ని బస్సు సర్వీసుల్లో రెండు సీట్లు రిజర్వు చేస్తారు.
- రైల్వేస్టేషన్లలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లు ఉంటాయి, వారికి వీల్ చైర్ సదుపాయం కల్పిస్తారు. 60 ఏళ్లు వయస్సు దాటిన వృద్ధులు, 45 ఏళ్లకు పై బడిన ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు, గర్భిణులకు రిజర్వేషన్ సమయంలో లోయర్ బెర్త్‌ల కేటాయింపులో ప్రాధాన్యం కల్పిస్తారు.
- ఈకార్డున్న వారికి న్యాయస్థానాల్లో కేసుల విచారణ సమయంలో ప్రాధాన్యం లభిస్తుంది. పాస్‌పోర్టు సేవా చార్జీల్లో 10 శాతం రాయితీ ఉంటుంది.
- 60 ఏళ్లు పైన వయస్సుంటే రూ. 3లక్షల వరకు, రూ. 80 ఏళ్లు దాటితే రూ. 5 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.
- బీమా పాలసీ తీసుకుంటే సెక్షన్80సీ ప్రకారం కింద పన్ను మినహాయింపు ఉంటుంది.

ఉల్లి ధర పతనం

- గొర్రెలకు పంట వదిలేసిన రైతులు ● సంచులతో తీసుకెళ్తున్నగ్రామస్థులు ● ఆదుకోవాలని రైతుల ఆవేదన



చింతలచెరువులో ఉల్లిగడ్డలను సంచులకు వేసుకుంటున్న మహిళలు



గొర్రెలకు వదిలేసిన ఉల్లిగడ్డలు

చాగలమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపంట రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. మూడు నెలలు కష్టించి పండించిన ఉల్లిపంటకు ధర లేక రైతులు నష్టపోయారు. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చింతలచెరువు, కొలుములపేట గ్రామాల్లో రైతులు శ్రీనివాసరెడ్డి 1.50 ఎకరాలు, మద్దిలేటి 2 ఎకరాలు, కొలుములపేటకు చెందిన సంజీవరెడ్డి 3 ఎకరాలు, సురేష్‌రెడ్డి 2 ఎకరాలు, సహదేవరెడ్డి 2 ఎకరాలు ఉల్లి సాగు చేశారు. ధర లేకపోవడంతో ఆదివారం పొలంలోనే ఉల్లి కుప్పలను వదిలేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు పొలం వద్దకు వెళ్లి సంచుల్లో ఉల్లిగడ్డలను నింపుకొని తీసుకెళ్లారు. మరి కొందరు రైతులు ఉల్లిగడ్డలను గొర్రెలకు మేతగా వదిలేశారు. కోత కోసిన ఉల్లిగడ్డలు వర్షానికి తడిసి దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. కేజీ ధర రూ.2 పలుకుతున్న ఉల్లిగడ్డల కోత కూలి ఎకరాకు రూ. 15 వేలు అవుతుండటంతో పంట పొలాల్లోనే వదిలేశామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.60 వేల దాక ఖర్చు చేశామని, 8 ఎకరాలకు రూ.4.50 లక్షలు పెట్టుబడి పెట్టి ఉల్లిగడ్డలు సాగు చేస్తే పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన చెందారు. తీరా పంట చేతికొచ్చాక ధర పతనం కావడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు కూడా ముందుకు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకునేందుకు పరిహారం ఇచిచ ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెద్దహుల్తి లింగేశ్వరా..
పాహిమాం..

- వైభవంగా పెద్దహుల్తి కారుమంచి, లింగేశ్వరస్వామి ఉత్సవాలు
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే బస్తిపాటి నాగరాజు, కేఈ శ్యాంబాబు



గంగపూజలో కారుమంచి,హల్తిలింగేశ్వరస్వాములు

పత్తికొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహుల్తి గ్రామంలో పెద్దహుల్తి కారుమంచి, లింగేశ్వర స్వామి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున బీరప్ప డోళ్లు, గొరవయ్యల వేణుగానాల నడుమ స్వామివారి ఘటాలు గంగపూజకు బయల్దేరాయి. గంగ పూజ అనంతరం స్వామివారి ఘటాలను పూజారులు తలపైఎత్తుకుని బయలుదేరారు. ఈ సమయంలో స్వామివారి అనుగ్రహం కోసం భక్తులు రోడ్డుకు ఇరువైపులా బోర్లా పడుకుని ఎదురుచూశారు. ఘటాలను మోస్తున్న స్వాములు భక్తులను కాలితో తట్టిలేపి వారి భవిష్యత్ గురించి వివరిస్తారు. మూడురోజులపాటు గ్రామంలో జరిగే ఈ ఉత్సవాలకు స్థానికులతో పాటు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతిఏడాది దీపావళి అమావాస్య తర్వాత మూడు రోజుల పాటు ఇక్కడ స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఘటాలను మోస్తున్న వారి పాదాలు తగిలితే సమస్యలు దూరమవుతాయని భక్తుల విశ్వాసం. ఇందుకోసం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఇదిలా ఉండగా ఉత్సవాల్లో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎంపీ నాగరాజు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి మాజీ సర్పంచ్ తిప్పన ఆలయం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్దహుల్తి లింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో రూ.40 లక్షల ఎంపీ నిధులతో నూతన కల్యాణమండపానికి భూమి పూజ చేశారు.



పడుకున్న భక్తులను కాలితో తడుతూ ఘటం మోస్తున్న స్వామి



హల్తిలింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ బస్తిపాటి, ఎమ్మెల్యే కేఈ

ముంచేశాయి

(5వ పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటా మద్దతు ధర రూ.8,110 నిర్ణయించింది. మార్కెట్లో ఆ ధర కంటే తక్కువ ఉన్నప్పుడు భారత పత్తి సంస్థ (సీసీఐ) మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. సెప్టెంబరు నుంచే పత్తితీత మొదలైంది. మార్కెట్‌కు వెళితే క్వింటా రూ.4-7వేలకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. గురువారం ఆదోని పత్తి మార్కెట్ ధరలు పరిశీలిస్తే కనిష్ఠంగా రూ.4,009, గరిష్ఠంగా రూ.7,519 పలికింది. మధ్యస్థంగా రూ.7,289 ఉంది. అంత కంటే తక్కువ ధరకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇలాంటి సమయంలో అండగా నిలవాల్సిన సీసీఐ కొనుగోలు కేంద్రాలే తెరవలేదు. కఠిన నిబంధనలు పెట్టడంతో కాటన్ జిన్నింగ్ పరిశ్రమల యాజమాన్యం ముందుకు రావడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు తక్షణమే ప్రారంభించి అన్నదాతకు అండగా నిలవాలి. రాష్ట్ర ప్రభుత్వం సైతం వ్యవసాయ శాస్త్రవేత్తలను క్షేత్రస్థాయికి పంపించి నష్టం తీవ్రతపై అధ్యయనం చేయించాలి. ఉల్లి రైతుల తరహాలో పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ల లోడింగ్ కోసం పోటాపోటీ

- నాగులదిన్నె, జోహరాపురం, ముద్దటమాగి రీచ్‌లకు టెండర్లు
- 22మంది కాంట్రాక్టర్లు షెడ్యూళ్లు దాఖలు
- 25న ఓపెన్ చేయనున్న మైనింగ్ అధికారులు

కర్నూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుంగభద్ర, వేదావతి నదుల్లో గుర్తించిన ఇసుక రీచ్‌ల్లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ఇసుక లోడింగ్ కాంట్రాక్ట్ కోసం మైనింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల అండతో ఈ టెండర్లు దక్కించుకోవడానికి కాంట్రాక్టర్లు పైరవీలు చేశారు. సిండికేట్ బెడిసికొట్టిందో? మరే ఇతర కారణమో వారికే ఎరుక. చివరి రోజు గురువారం పోటాపోటీ మూడు రీచ్‌లకు 22మంది కాంట్రాక్టర్లు టెండరు షెడ్యూళ్లు దాఖలు చేయడం కొసమెరుపు. తుంగభద్ర నదిలో నందవరం మండలం నాగులదిన్నె రీచ్‌లో 1.20లక్షల మెట్రిక్ టన్నులు, గంగావరం-జోహాపురరం రీచ్‌లో 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, వేదావతి నదిలో హొళగుంద మండలం ముద్దటమాగి రీచ్‌లో 75 వేలు మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. ఉచిత ఇసుక పాలసీలో భాగంగా ఈరీచ్‌లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీల్లో లోడింగ్ చేసేందుకు ఒక్కో టన్నుకు రూ.45ల ప్రకారం వినియోగదారుడి నుంచి వసూలు చేసేలా ప్రభుత్వం ధర నిర్ణయించింది. మూడు రీచ్‌లో 3.45లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక లోడింగ్ కాంట్రాక్ట్ విలువ సుమారు రూ.1.55కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఈనెల 10వ తేదీన టెండర్ నోటీస్ జారీ చేస్తే బుధవారం వరకు ఒక్క షెడ్యూల్ కూడా దాఖలు చేయలేదు. చివరి రోజు గురువారం నాగులదిన్నె రీచ్‌కు 11, గంగావరం-జొహరాపురం రీచ్‌కు ఆరు, ముద్దటమాగి రీచ్‌కు ఐదు చొప్పున 22 టెండరు షెడ్యూళ్లు దాఖలు చేశారు. ఈనెల 25న టెక్నికల్, ప్రైజ్ బిడ్ ఓపెన్ చేస్తామని గనులు భూగర్భ వనరులు (మైనింగ్) శాఖ డీడీ రవిచంద్ర 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు, లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌ఓఐ) ఇచ్చిన మూడు రోజుల్లోగా లోడింగ్ టెండర్ కాస్ట్ విలువపై పదిశాతం చొప్పున నాగులదిన్నె రీచ్‌కు రూ.5.10లక్షలు, గంగావరం-జొహరాపురం రీచ్‌కు రూ.6.75లక్షలు, ముద్దటమాగి రీచ్‌కు రూ.3.37 లక్షలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ఆ తరువాత మైనింగ్ నిబంధనలు మేరకు ఒప్పందం చేసుకొని టెండరు దక్కించుకున్న రీచ్‌ల్లో ఇసుక లోడింగ్ ప్రక్రియ చేపట్టవచ్చని అధికారులు తెలిపారు.



హొళగుంద మండలం వేదవతి నదిలో ఇసుక తవ్వకాలు(ఫైల్)

ప్రభుత్వంపై దుష్ప్రచారం

- వైసీపీ తీరును విమర్శించిన గౌరు చరితారెడ్డి

కల్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తున్నదని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కల్తీమద్యం, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ మద్యం సూత్రధారులు, పాత్రధారులు వైసీపీ నాయకులే కావడం ప్రజలు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. గత వైసీపీ పాలనలో జే.బ్రాండ్ కల్తీమద్యంతో 30 లక్షల మంది అనారోగ్యం బారిన పడ్డారని, 30వేల మంది చనిపోయారని విమర్శించారు. కల్తీమద్యంపై వైసీపీ ఆరోపణలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కేఎస్ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీ చైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, పెరుగు పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

- మినిట్స్ బుక్ ఇవ్వాలని ఆదేశం
- రెండు రోజుల తర్వాత రావాలన్న ఆర్‌వో



ఎంపీడీవోతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో జనార్ధన్‌పై మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయిప్రసాద్‌రెడ్డి తమ అనుచర గణంతో మండల కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీపీ బడాయి దానమ్మపై వైసీపీ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో ఆయన జీర్ణించుకోలేకపోయారు. అవిశ్వాస తీర్మాన సమావేశ మినిట్స్ బుక్ ఇవ్వడంటూ ఎంపీడీవోను సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. అవిశ్వాస తీర్మాన సమావేశం మినిట్స్ బుక్ ఆర్‌వో (రిటర్నింగ్ అధికారి) అజయ్‌కుమార్ పరిధిలో ఉంటుందని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కాదని, మినిట్స్ బుక్ ఇవ్వడం కుదరదని ఎంపీడీవో సమాధానమిచ్చారు. సాయిప్రసాద్‌రెడ్డి ఆవేశానికి గురై వెంటనే ఆర్‌వోకు ఫోన్ చేశారు. మాకు ఇప్పుడే మినిట్స్ బుక్ కావాలని ఆర్‌వో అజయ్‌కుమార్‌ను కోరాడు. రెండు రోజుల తరువాత రావాలని, అప్పుడు ఇస్తానని ఆర్‌వో సమాధానమిచ్చారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఇప్పుడే కావాలని పట్టుపడడంతో ఆర్‌టీఐ యాక్టుకు దరఖాస్తు చేసుకోండి అప్పుడు ఇస్తాం.. ఇప్పుడు ఇచ్చేది లేదంటూ ఎంపీడీవో చెప్పారు. చేసేదేమీ లేక వైసీపీ నాయకులు, సాయిప్రసాద్ రెడ్డి అక్కడి నుండి వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి తదితరులున్నారు.

సుబ్బరాయుడు సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సాగునీటి రంగంలో రిటైర్డు ఇంజనీర్, రాయలసీమ నీటి రంగ నిపుణులు సుబ్బరాయుడు సేవలు మరువలేనివని జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి, విద్యావంతుల వేదిక, జిల్లా జల సాధన సమితి సంయుక్తంగా దివంగత సుబ్బరాయుడు సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. సిద్ధేశ్వరం అలుగు, వేదవతి ప్రాజెక్టు, గుండ్రేవుల రిజర్వాయర్, ఆర్డీఎస్ కుడి కాలువలకు సుబ్బరాయుడు డిజైన్ చేశారనీ గుర్తు చేశారు. కరువు, వలసలు, రైతుల ఆత్మహత్యలు నివారించాలంటే ప్రాజెక్టుల నిర్మాణమే సాధ్యమని, సీమ ఉద్యమానికి ఆయన మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు సుబ్బరాయుడు పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి విరసం బాధ్యులు పాణి, నాయకులు రత్నం ఏసేపు, ఆదినారాయణ రెడ్డి, జగన్నాథం, రామకృష్ణారెడ్డి, సీపీఐ (ఎం) నాయకులు రాముడు, యోహాన్, డేవిడ్, సీమ కృష్ణ, సుబ్బరాయుడు కుమారుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని కాపాడిన రైల్వే పోలీసులు

కొలిమిగుండ్ల/తాడిపత్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోయిన సాయినాయక్‌ను రైల్వే పోలీసులు శివారెడ్డి, వరప్రసాద్ రక్షించారు. వారు తెలిపిన మేరకు.. కొలిమిగుండ్లకు చెందిన సాయినాయక్ ఇంటిలో గొడవ పడి, మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. ఈక్రమంలో రైలుకింద పడి చనిపోవాలని తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఓ గూడ్సు రైలు వస్తుండగా ఎదురు వెళ్లాడు. దీన్ని గమనించిన రైల్వే పోలీసులు అప్రమత్తమై అతడిని కాపాడారు. తర్వాత అతన్ని విచారించి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులను పిలిపించి వారికి అప్పగించారు.



వ్యక్తిని అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

మిశ్రమ పంటలపై అవగాహన కల్పించండి

- కలెక్టర్ డా.సిరి
- వివిధ శాఖల అధికారులతో విడివిడిగా సమావేశం, టెలీ కాన్ఫరెన్స్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మిశ్రమ పంటల సాగు, ఎరువుల సమర్థ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో 'భూమాత రక్షణ'కు సంబంధించిన జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, భూసార పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం 'భూమాత రక్షణ'ను అమలు చేస్తోందన్నారు. జేడీఏ వరలక్ష్మి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి, చిత్రంలో జేసీ

- అన్న క్యాంటీన్లపై గురువారం మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. టిఫిన్, భోజన నిర్వహణ గురించి ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ద్వారా ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను సేకరిస్తోందని, లోపాలు లేకుండా చూడాలన్నారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.
- కర్నూలును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ సిరి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రహదారుల అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్, నీటి సరఫరా వ్యవస్థ, పార్కుల అభివృద్ధి తదితర అంశాలకు సంబంధించి పూర్తి వివరాలతో యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు.
- జిల్లాలో ఆరోగ్యం, విద్య, వసతి నిలయాలు, మహిళా సంక్షేమం, పారిశుధ్య నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్పెషల్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఈవో సెట్కూరు డా.కే.వేణుగోపాల్‌ను నోడల్ అధికారిగా నియమించామని, కంట్రోల్ రూమ్ సిబ్బంది ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్.1800 425 4299 ద్వారా సంప్రదించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
- ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని పురోగతి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్చరించారు. ఉదయం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్‌కు సంబంధించి లబ్ధిదారులు ఇచ్చిన ఐవీఆర్ఎస్ సమాధానాలు సంతృప్తికరంగా లేవన్నారు. నవంబరు 5వ తేదీలోపు సర్వే నిర్వహించాలని ఆదేశించారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించండి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలని కలెక్టర్ డా.సిరి డీఎంహెచ్‌వోను ఆదేశించారు. రెండోసారి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన డా.ఎల్.భాస్కర్ గురువారం రాత్రి కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డా.ఎల్.భాస్కర్ సొంత ఊరు కడప జిల్లా, రాజంపేట. వెంకటరామరాజు, బుజ్జమ్మ తల్లిదండ్రులు. 2004లో తిరుపతిలో ఎంబీబీఎస్ పూర్తి చేసి 2007లో కడప జిల్లా వనిపెంట పీహెచ్‌సీలో ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టారు. 2007లో మహబూబ్‌నగర్‌లో ఫల్మనాలజీలో ఎండీ పూర్తి చేశారు. 2018 నుంచి 2022 వరకు కడపలో జిల్లా టీబీ ఆఫీసర్‌గా పనిచేసి, సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది కర్నూలు జిల్లా టీబీ ఆఫీసర్‌గా 2022 నుంచి పని చేస్తున్నారు.

హాస్టల్ తనిఖీ

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఆనంద నిలయం వసతి గృహాలను గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తనిఖీ చేశారు. సౌకర్యాలు ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను సూచించారు. పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, వ్యాధులు రాకుండా మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు అందించే స్నాక్స్‌ను రుచి చూశారు. లీగల్ సర్వీసెస్ సభ్యులు డా.రాయపాటి శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్స్ సులోచన, శైలజ, రజిని తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న లీలా వెంకట శేషాద్రి

పనుల్లో పురోగతి ఉండాలి

- డిసెంబరు 31 లోపు పూర్తిచేయాలి
- విద్యుత్ ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్

కల్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం పనుల్లో పరోగతి పెంచాలని, పల్లెల్లో నిరంతర త్రీఫేస్ విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, విద్యుత్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్.ప్రదీప్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం విద్యుత్‌భవన్ కన్‌స్ట్రక్షన్ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ పనుల్లో భాగంగా 11కె.వి ఫీడర్స్, డీటీఆర్ ఎరక్షన్స్, స్మార్ట్ మీటర్స్, 33కె.వి ఓవర్‌లోడ్ ఫీడర్స్, లైన్స్ డిసెంబరు 31లోపు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు డివిజన్లలో ఎల్‌ఎంసీ 24-7 ఉండాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పనిచేస్తున్న హెడ్‌క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేలా కృషి చేయాలని ఎస్ఈ ప్రదీప్‌కుమార్ సూచించారు.

పెళ్లి పేరిట మోసం

- గర్భం దాల్చి.. ప్రసవించిన బాలిక

పత్తికొండ/యాడికి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ బాలికను గర్భవతిని చేసిన రాజ అనే వ్యక్తిపై అనంతపురం జిల్లా యాడికి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. యూపీఎస్ సీఐ ఈరన్న తెలిపిన మేరకు, నిందితుడు పత్తికొండ పట్టణవాసి. బాధిత బాలిక యాడికి మండలంలోని ఓ గ్రామంలో పదో తరగతి వరకు చదివింది. ఆ తరువాత చదువు మానేసి కర్నూలు జిల్లా మద్దికెరలోని తన నాన్నమ్మ ఇంట్లో ఉండేది. మద్దికెరకు ఒక వివాహంలో పాల్గొనేందుకు వచ్చిన రాజ.. బాలికకు పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. దసరా పండుగకు తల్లిదండ్రుల వద్దకు వచ్చిన బాలిక, ఈ విషయం గురించి తెలియజేసింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే గర్భందాల్చిన బాలిక, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో బుధవారం రాత్రి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక గురువారం తెల్లవారుజామున ఆడబిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు బాలిక తల్లిదండ్రులు ఉంటున్న ప్రాంతానికి వెళ్లి విచారించారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అంగన్‌వాడీ వర్కర్, మహిళా సంరక్షణ కార్యదర్శి స్టేషన్‌కు వెళ్లారు. బాలిక అనంతపురంలో ప్రసవించినందున, అక్కడే ఫిర్యాదు చేయాలని పోలీసులు వారికి సూచించారు. దీంతో వారు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం

డోన్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కాలుజారి రైలు కిందపడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన డోన్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ బిందు మాధవి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని త్రివర్ణ కాలనీకి చెందిన సతీష్ కుమార్(52) అనే వ్యక్తి గుంతకల్లు నుంచి కాచిగూడకు వెళ్తున్న రైలును మొదటి ప్లాట్‌ఫారంలో గురువారం ఉదయం ఎక్కబోయాడు. అదుపుతప్పి కాలుజారి రైలు కింద పడి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- సుంకేసుల ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్



ఎస్ఈతో కలిసి ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. జిల్లాలో ప్రాజెక్టులలో నీటి నిల్వలు సాగు, తాగునీటి అవసరాలపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రం సుంకేసుల బ్యారేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీ కాలువ కింద రబీ సాగునీటి అవసరాలు తీరుస్తూ వేసవిలో కర్నూలు నగరానికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది తుంగభద్రకు భారీగా వరద వచ్చిందని రికార్డు స్థాయిలో 335 టీఎంసీలకు పైగా శ్రీశైలానికి విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఎస్ఈ బాల చంద్రారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఎస్ఈ బాలచంద్రారెడ్డితో పాటు కేసీ కెనాల్ సబ్ డివిజన్ డీఈఈ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

రెండో రోజు లా సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ పరిధిలోని ఉస్మానియా కళాశాలలో లా 3, 5వ సంవత్సరం నాల్గవ సెమిస్టర్ పరీక్షలు బుధవారం నిర్వహించారు. 5వ సంవత్సరం 4వ సెమిస్టర్‌కు 73 మందికి 63, 3వ సంవత్సరం 4వ సెమిస్టర్‌కు 306 మంది దరఖాస్తు చేసుకోగా 274 మంది హాజరయ్యారని కంట్రోలర్ డా.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫిజియోథెరపీ కోసం రోగుల నరకయాతన



ఫిజియోథెరపీ కోసం వేచి చూస్తున్న రోగులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఫిజియోథెరపీ (ఓపీ.నెంబర్.41) కోసం వచ్చిన రోగులు నరకయాతన అనుభవించారు. లో ఓల్టేజీ, విద్యుత్ సమస్యలతో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు యంత్రాలు పనిచేయలేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు నరకయాతన అనుభవించారు.

మల్లన్న సన్నిధిలో కేంద్ర మంత్రి సావిత్రీ ఠాకూర్

- స్వామివారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి ఏవీ రెడ్డి

శ్రీశైలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవారిని గురువారం కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి సావిత్రీ ఠాకూర్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఏవీ రెడ్డి వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం వచ్చిన వీరికి ఆలయ ప్రధాన గోపురం వద్ద ఈఓ శ్రీనివాసరావు, ఏఈఓ వెంకటేశ్వర రావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసుకుని ప్రాకారంలోని పరివార ఆలయాలు కూడా దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రాకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.



కేంద్రమంత్రికి చిత్రపటం ఇస్తున్న ఈవో

రేపు డిప్లొమా కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్లమా ఇన్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ సర్వీసెస్ (పారా మెడికల్) కోర్సులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 25న ఉదయం 10 గంటలకు కాలేజీలోని ఆడిటోరియంలో ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

మండల అభివృద్ధికి పాటుపడాలి: ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ చిన్నసంజీవరెడ్డి

బండిఆత్మకూరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వానలు విపరీతంగా కురుస్తున్నాయని, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో గాయత్రి ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతిని సభలో వివరించారు. సమావేశంలో ఏఈలు లక్ష్మీనరసింహా, వెంకటరాముడు, వాసుదేవుడు, కభగిరి, ఏపీవో వసుధ, ఏపీఎం గుర్రప్పడు, డాక్టర్ భావన, ఈవో ఆర్డీ రామకృష్ణవేణి, వార్డెన్ గంగాధరగౌడు, సొసైటీ చైర్మన్లు సాయి బాబారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

శాంతిరాం పర్యవేక్షణలో పీఎంశ్రీ పాఠశాలలు


ఐఐసీ సభ్యులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ శాంతిరాముడు

పాణ్యం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల పర్యవేక్షణలో 44 ప్రభుత్వ పాఠశాలలు పని చేయనున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పీఎంశ్రీ పాఠశాలలను శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల పర్యవేక్షణలో నిర్వహణ జరిగేలా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఏఐసీటీఈ ద్వారా 44 పాఠశాలలకు మెంటర్‌గా అవకాశం లభించిందన్నారు. ఈ పాఠశాలల్లో 16 మోడల్, 24 జెడ్పీహెచ్ ఎస్, నాలుగు వెల్ఫేర్ పాఠశాలలు ఉన్నాయన్నారు. 14 మంది సభ్యులు ఉంటారన్నారు. ప్రతి సభ్యుడు నాలుగు పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతను స్వీకరిస్తారన్నారు. కళాశాల చైర్మన్ శాంతిరాముడు ఐఐసీ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఐఐసీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ సౌమ్య పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ఆత్మకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ ఉర్దూ పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ కొత్తపల్లి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కమతం శంకర్, సహాధ్యక్షుడు ఉమర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా రామాంజనేయులు, అధ్యక్షుడిగా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, సహాధ్యక్షుడిగా గురుస్వామి, ఉపాధ్యక్షులుగా చిన్నకృష్ణయ్య, నాగేష్, వెంకటేశ్వర్లుగౌడ్, మౌనిక, దుర్గాకీర్తి, పుష్పావతమ్మ, అదనపు కార్యదర్శిగా రాజ్‌కుమార్, కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు అధికారిగా జిల్లా కార్యదర్శి తులసీశ్వరరెడ్డి, పరిశీలకులుగా రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్‌వహీద్ వ్యవహరించారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన వారిచే ప్రతిజ్ఞ చేయించారు.

బుక్కాపురం పొలాల్లో కొండ చిలువ

మహానంది, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బుక్కాపురం పొలాల్లో గురువారం కొండ చిలువ ప్రత్యక్షం అయ్యింది. గమనించిన రైతులు స్నేక్ క్యాచర్ మోహన్‌కు తెలిపారు. ఆయన వచ్చి చాకచక్యంగా కొండ చిలువను పట్టుకొని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశారు. ఇటీవల మహానంది మండలంలో వర్షాకాలం కావడంతో విషపురుగుల సంచారం అధికమైందని ప్రజలు తెలిపారు.

వర్షార్పణం

- మొక్కజొన్న రైతు విలవిల
- ఎడతెరిపి లేని వర్షాలు
- ధరల్లో వ్యాపారులు కోత
- అప్పుల్లో కౌలురైతులు


వర్షానికి తడిసిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతులు

జూపాడుబంగ్లా, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ ముగిసినా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నందికొట్కూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పగిడ్యాల, మిడుతూరు మండలాల్లో ఎన్నడూలేని విధంగా మొక్కజొన్న సాగు చేశారు. గతేడాది డివిజన్‌లో 18వేల హెకార్లుసాగు చేయగా, ఈ ఏడాది ఏకంగా 24వేల హెకార్లు సాగుచేశారు. వర్షాల కారణంగా పంట కోతకోసిన రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం తడుస్తు...ఆరుతూ రైతుల అగచాట్లు అంతాఇంతా కాదు. సరాసరి ఎకరాకు 30క్వింటాళ్లు దిగుబడి రావాల్సి ఉండగా 20 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ధాన్యం క్వింటా రూ. 1800 అడుగుతున్నారని దీంతో ఎకరాకు దాదాపు రూ. 20వేలు అప్పు మిగులుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు కూడా వర్షానికి ధాన్యం తడుస్తుందని తక్కువ ధరకు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ప్రకారం తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డిని వివరణ కోరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



20ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశా. పంటకోత కోసి ఆరబెటుకున్నాం. ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుతున్నాయి. ధాన్యం తడిసిపోతుంది. వ్యాపారులు మాత్రం క్వింటాలుకు రూ. 1800 అడుగుతున్నారు. ఆ ప్రకారమైతే రూ. 2లక్షల వరకు అప్పు మిగులుతుంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీసమద్దతు ధర అందేలా చూడాలి.

- రమణయ్య, కౌలురైతు, జూపాడుబంగ్లా

మద్దతు ధరలు లేక.. నష్టపోతున్నరైతులు


వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

పాములపాడు : ఈ ఏడాది ఖరీఫ్ రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. మొదట అనావృష్టితో కొంతనష్టం తర్వాత అతివృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి నెలకొంది. దాదాపు రెండు నెలలుగా వర్షాల కారణంగా మండలంలో వాగు లు వంకలు పొంగి పంటపొలాలను ముంచెత్తడం, పొలాలలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో కొంతమేర పంటలు కుళ్లిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాస్తోకూస్తో పండిన పంటలను కోసుకొందామంటే ఏకదాటిగా వర్షాలు కురుస్తున్నాయి. మెట్ట పొలాల్లో కోసిన మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర లేకపోవడం, గ్రామాల్లో దళారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరలు ఇష్టారాజ్యంగా తగ్గిస్తూ కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో ఏడు వేల హెక్టారుల్లో మొక్కజొన్న, రెండువేల హెక్టారుల్లో సోయచిక్కుడు, వెయ్యి హెక్టారుల్లో పత్తి సాగుచేశారు. వర్షాల కారణంగా మొక్కజొన్న రెండువేల హెక్టారులకు పైగా పంట పూర్తిగా దెబ్బతిన్నాయి. పండిన ధాన్యం వర్షానికి తడవకుండా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.2400 మద్దతు ధర ప్రకటించినా ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు, దళారులు కలిసి ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తూ రైతులను నిలువున దోచేస్తున్నారు. అధికారులు, నాయకులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరను కల్పించి రైతుల కోరుతున్నారు.

తగ్గిన దిగుబడులు



ఖరీఫ్‌లో సాధారణ వర్షపాతం కన్న అధికంగా పడటంతో గింజలు కాసే సమయంలో కంకి పెరగకపోవడంతో భారీగా దిగుబడి తగ్గింది. ఎకరాకు 20 క్వింటాళ్లు కూడా రావడంలేదు. వ్యాపారులంతా కుమ్మక్కై ధరలు అమాంతంగా తగ్గించారు. 15 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేశా. ఈ ఏడాది అప్పుల్లో కూరుకుపోవాల్సిందే.

- వెంకటేశ్వర్లు, కౌలురైతు

తడిసిన ధాన్యాన్ని కొనాలి



అతివృష్టి, అనావృష్టివల్ల మొక్కజొన్నరైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట కోత సమయంలో ఎడతెరిపిలేకుండా వర్షాలు పడి ధాన్యం తడుస్తోంది. ప్రభుత్వం వెంటనే కేంద్రాలను ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.

- పిక్కిలివెంకటేశ్వర్లు, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి

ఆరోగ్యశ్రీ వైద్య సేవలను పునరుద్ధరించాలి

ఆత్మకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ వైద్యసేవలను పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి సక్రమంగా నిధులు కేటాయించకపోవడం ఈ సేవలను ప్రైవేట్ ఆసుపత్రులు నిలిపి వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనివల్ల పేదలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే చెల్లించి సేవలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగు

- వాహనాల రాకపోకలకు అంతరాయం


నల్లమల అటవీ ప్రాంతంలో ప్రవహిస్తున్న వాగు

ఆత్మకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి రోళ్లపెంట ఘాట్ దాటిన తర్వాత ఓ వాగు ఉప్పొంగి ప్రవహించింది. దాంతో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాగు ఉధృతంగా ప్రవహించడంతో దోర్నాల పోలీసులు అక్కడికి చేరుకుని మధ్యాహ్నం వరకు వాహనాల రాకపోకలను నిలిపేశారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత మధ్యాహ్నం 2గంటల నుంచి వాహనాల రాకపోకలు కొనసాగాయి.

టీచర్ వచ్చారు..!

- తల్లిదండ్రుల హర్షం


పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం కృష్ణానది ఒడ్డున ఉన్న జానాలగూడెంలో కొంత కాలంగా ఉపాధ్యాయుడు లేక మూతపడిన ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలకు ఎట్టకేలకు ఐటీడీఏ అధికారులు ఉపాధ్యాయుడిని నియమించారు. ఈ నెల 22న గూడెంలో 'బడికి తాళం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఇందుకు ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించారు. గురువారం ఆ పాఠశాలకు ఆత్మకూరు మండలం నాగలూటి గూడెంలోని గిరిజన పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న శివాజీని ఉపాధ్యాయుడిగా నియమించారు. అతను గూడెంలో అడవిబాటలో ఉన్న విద్యార్థులను బడిబాట పట్టించారు. ఉపాధ్యాయుడు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి, అధ్యాపకులు

పాణ్యం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమని శాంతిరాం వైద్యురాలు జే. కార్తీక అన్నారు. గురువారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా శక్తి సెల్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో వైద్యురాలు మాట్లాడుతూ క్యాన్సర్ రకాలు, నివారణ చర్యలు, ప్రారంభ దశలో గుర్తింపు, స్వీయ పరీక్షలు, సమయానుకూల వైద్య సలహా అవసరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, నిరంతర ఆరోగ్య పరీక్షల అవసరాన్ని వివరించారు. సమావేశంలో మహిళా శక్తి సెల్ కోఆర్డినేటర్ ఎస్. హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి: సీడీపీవో


మాట్లాడుతున్న సీడీపీవో మంగవల్లి

నందికొట్కూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాలికలు వైద్య విద్యా రంగాల్లో రాణించాలని సీడీపీవో మంగవల్లి కోరారు. గురువారం పట్టణంలోని స్థానిక బాలికల జిల్లాపరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనపరిచిన బాలికలకు సీడీపీవో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఆశీర్వాదమ్మ, వెంటేశ్వరమ్మ, పావని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పగిడ్యాల: బాలికలపై వివక్షత చూపరాదని ఎంపీడీవో సుమిత్రమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు ఉల్యాల దివ్య అన్నారు. మండల పరిధిలోని పగిడ్యాల జడ్పీ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపీఎం చంద్రకళ, ఎంఈవో సుభాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ ఉన్నారు.

పాములపాడు: మండలకేంద్రంలోని ఏఎన్ఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లలిత, ప్రభావతి, ఆశీర్వాదమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సూత్రాలను తెలిపారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు శివలక్ష్మి, నాగమణి, నాగమద్దమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

- ట్రస్టబోర్డు చైర్మన్ రమేష్‌నాయుడు


పరిసరాలను పరిశీలిస్తున్న రమేష్‌నాయుడు

శ్రీశైలం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేందుకు అవసరమగు చర్యలు తీసుకుంటామని అలయ ట్రస్ట బోర్డు చైర్మన్ రమేష్‌నాయుడు అన్నారు. గురువారం బోర్డు సభ్యులతో కలిసి క్షేత్ర పరిధిలోని పలు కీలక ప్రాంతాల్లో పర్యటించారు. భక్తులు, శివసేవకులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సాయంత్రం చైర్మన్ పాటు సభ్యులు ప్రత్యేక పూజలు చేసుకుని గంగాధర మండపం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు.

నేడు ట్రస్‌బోర్డు సమావేశం

శ్రీశైల దేవస్థానం ట్రస్టబోర్డు చైర్మన్, సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తొలిసారి సమావేశమవుతున్నట్లు చైర్మన్ రమేష్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయ పరిపాలనా భవన సమావేశ మందిరంలో సమావేశం ఉంటుందని, బోర్డు సభ్యులంతా హాజరుకావాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు


మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజి

కొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ రామాంజీ నాయక్ హెచ్చరించారు. గురువారం రాత్రి మండలంలోని వీరాపురం గ్రామ బస్టాండు సెంటరులో శాంతిభద్రతలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, కొత్తపల్లి ఎస్ఐ జయశేఖర్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పునే వాడాలి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు అయోడిన్ ఉప్పునే వాడాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, షేక్ కాశింవలి అన్నారు. గురువారం సాయంత్రం నంద్యాల గాంధీచౌక్ వద్ద ఉన్న క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఫుడ్‌సేఫ్టీ ఆధ్వర్యంలో అయోడిన్ ఉప్పు వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాపారస్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు

వెలుగోడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసిందని, వినియోగించుకోవాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వరకు ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు.

గడువు పొడిగింపు

నంద్యాల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్డి కులానికి చెందిన విద్యార్థులకు అందజేసే స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు గడువును పొడిగించినట్లు అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, విద్య వైద్య ఉపకార వేతనం కమిటీ సభ్యుడు బైరెడ్డి అంజనరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు 9440222467 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

కోటి సంతకాల సేకరణ

నంద్యాల రూరల్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ నంద్యాల వైసీపీ నాయకులు గురువారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. నాయకులు గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు సాధిక్‌బాషా, సమ్మద్, ఆరీఫ్‌నాయక్, కలాం, తమీం పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

నంద్యాల టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగజ్జననీ నగర్‌కు చెందిన యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాలిలా.. జగజ్జననీ నగర్‌కు చెందిన బాలకృష్ణ (32) అనే యువకుడు ఇంట్లో అపస్మారకస్థితికి చేరాడు. బంధువులు గమనించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువకుడి మృతిపై అనుమానం ఉన్నట్లు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దోబీ పోస్టులను భర్తీ చేయాలి

నంద్యాల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలనిఏపీ రజక సంఘం వృత్తిదారుల కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నంద్యాల ఎన్జీవో కాలనీలో ప్రథమ మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జిల్లెల్ల శ్రీరాములు, సుబ్బరాయుడు, శివప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

ఆత్మకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు సద్దాం, రామ్‌నాయక్ ఉన్నారు.

ఆర్‌పీఎఫ్ అధ్యక్షుడిగా అశ్వత్థామ

నందికొట్కూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బలిజ కాపుల సంఘటిత చైతన్యం కోసం నిరంతరం కృషి చేసే రాయల్ పీపుల్ ఫ్రంట్ (ఆర్‌పీఎఫ్) నందికొట్కూరు అధ్యక్షుడిగా మిడుతూరు మండలంలోని చెరుకుచెర్ల గ్రామానికి చెందిన అశ్వత్థామ నియమకమయ్యారు. ఈమేరకు రాయల్ పీపుల్ ఫ్రంట్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు రెడ్డి శేఖర్ రాయల్ తిరుమల శెట్టి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు.

సీజనల్ హాస్టళ్ల నిర్వహణకు దరఖాస్తులు

ఆత్మకూరురూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన వ్యక్తులు, ఎన్జీవో సంస్థలు ఈ నెల 26లోగా సీజనల్ హాస్టళ్ల నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు మార్గరేట్, అయ్యూబ్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వడ్లరామాపురం గ్రామంలో హాస్టల్‌ను నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థిని ప్రతిభ

మహానంది, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థిని హర్షిత బాయ్ జాతీయ డైరీ పరిశోధన సంస్థలో సీటు సాధించినట్లు కళాశాల శాస్త్రవేత్తలు గురువారం తెలిపారు. ఇటీవల ఐసీఏఆర్ నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థిని 7వ ర్యాంక్ సాధించిందన్నారు. విద్యార్థిని వారు అభినందించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

నిండా మునిగిన రైతన్న

- తడిసిన మొక్కజొన్న పైరు
- పెరిగిన పెట్టుబడులు
- పతనమైన ధరలు

బనగానపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట వేసిన రైతులు ఈ ఏడాది నిండా మునిగారు. అకాల వర్షాల కు తోడు వ్యవసాయ పెట్టుబడులు పెరగడంతో రైతులు డీలాపడ్డారు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోయారు.

10వేల హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు

బనగానపల్లె నియోజకవర్గంలో 10వేల హెక్టార్లకు పైగా మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. గత ఏడాది మొక్కజొన్నలకు గిట్టుబాటు ధరలు లభించడంతో ఈ ఏడాది అధికంగా పంటలను సాగు చేశారు. గత ఏడాది క్వింటాం రూ.2300 ధర పలకడంతో రైతులకు గిట్టుబాటు ధర లభించింది. గత ఏడాది వేసిన పొగాకు, మిరప, పంటలు ధరలు పూర్తిగా పడిపోవడంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగు చేయడంతో వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

వర్షాలతో ఆర్థికంగా చితికిపోయిన అన్నదాతలు

గత నెలరోజులుగా మొక్కజొన్న పంట వేసిన రైతులు అధిక వర్షాలతో అతలాకుతలమై ఆర్థికంగా చితికిపోయారు. అధిక వర్షాలకు భయపడి పంట కోత కోయడానికి భయపడుతున్నారు. పంట కోసి ఆరబెడితే వర్షాలు కురుస్తాయన్న భయంతో రైతులు కేవలం 20 శాతం మాత్రమే మొక్కజొన్న పంటను కోశారు. వీరు కూడా కోసినప్పట్నుంచి వర్షాలు వస్తుండడంతో మొక్కజొన్న పంట తడిసి ముద్దయిపోతోంది. కోసిన మొక్కజొన్న ఆరబెట్టడానికి రైతులు అవస్థలు పడుతున్నారు.

పెరిగిన పెట్టుబడులు: ఈ ఏడాది మొక్కజొన్న పంటలకు పెట్టుబడులు బాగా పెరిగిపోయాయి. ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడులు పెట్టారు. వ్యవసాయ కూలీలు, సేద్యపు ఖర్చులు, చీడ పీడల నివారణకు పురుగుల మందులకు కూడా అధికంగా వాడారు. దీనికితోడు వ్యాపారులు బస్తా యూరియా ధర రూ.300లోపు అమ్మాల్సి ఉండగా రూ.450నుంచి 500లకు అమ్మారు.

తగ్గిన ధరలు: గత ఏడాదితో పోలిస్తే ఎకరాకు ఈ ఏడాది కేవలం మొక్కజొన్నలు 30 నుంచి 25 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చాయి. గత ఏడాది ఎకరాకు 30నుంచి 35 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. గత ఏడాది క్వింటాం రూ.2300 ధర పలికింది. కాని ఈ ఏడాది క్వింటాం రూ.1700లకు కూడా వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు.



తడిసిన మొక్కజొన్న పంట

తీవ్రంగా నష్టపోయా



7 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఎకరాకు రూ.20వేలు ఖర్చు చేశా. అకాల వర్షాల వల్ల పంట మొత్తం తడిసిపోయింది. దీంతో క్వింటాం రూ.1700 వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మొక్క జొన్న పంట వేసి తీవ్రంగా నష్టపోయా.

- సుబ్బయ్య, రైతు, పాతపాడు

రైతులను ఆదుకోవాలి



ఈ ఏడాది పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. పెట్టుబడులు పెరిగాయి. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు మద్దతు ధర ప్రకటించాలని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

- శివశంకర్, రైతు, పాతపాడు

రాయల్టీ సమస్యతో రోడ్డున పడ్డ కార్మికులు

సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు



మాట్లాడుతున్న రంగనాయుడు

కొలిమిగుండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాయల్టీ వసూలు ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో గని కార్మికులు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. గురువారం కొలిమిగుండ్ల మండలంలోని నాపరాళ్ల గనుల్లో పర్యటించి, గనుల యజమానులు, కార్మికులతో మాట్లాడారు. జిల్లాలోని కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె, బేతంచెర్ల తదితర ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులు నాపరాళ్ల గనుల ఆధారంగా జీవనం సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంజీవులు, నాగాంజనేయులు, సూరి, మహేష్, రైతు సంఘం నాయకులు పుల్లయ్య, బాబు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

అవుకు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు సొంత భవనాన్ని నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో బ్రిటీష్ కాలం నిర్మించిన భవనంలోనే 2008లో ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కళాశాలలో ప్రస్తుతం 360 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రాక్టికల్స్ చేసుకొనే అవకాశం లేక లక్షల విలువ చేసే పరికరాలు గదు లకే పరిమితమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంజీ వులు, నాగాంజనేయులు, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా



ఉద్యోగాలు పొందిన వారితో అతిథులు

బనగానపల్లె, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 10 ప్రైవేటు కంపెనీలు , వారి ప్రతినిధులు హాజరై నిరుద్యోగ యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 348 మంది హాజరు కాగా 158 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగార్హత పొందినట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పిన్సిపాల్ లలిత, వైస్ ప్రిన్సిపాల్ గౌస్, అధ్యాపకులు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన ఆముదం

ప్యాపిలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట దిగుబడులు తడిసి ముద్దవుతున్నాయి. ప్రధానంగా ఆముదం, సజ్జ పంట దిగుబడులు వర్షాలకు పూర్తిగా తడవడంతో రైతులు రోడ్లపై వాటిని ఆరబెట్టుకుంటున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చేతికొచ్చిన సజ్జ, ఆముదం పంటలు నాశనవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు వర్షాలు కురువడంతో సజ్జ పంట ఆశాజనకంగా వచ్చిందని, అయితే వర్షాలకు పంట దెబ్బతినడంతో చేతికి చిల్లిగవ్వ కూడ రాని పరిస్థితి నెలకొందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



ఏనుగమర్రిలో తడిసిన ఆముదం పంటను ఆరబెట్టుకుంటున్న రైతులు

మొక్కజొన్న రైతు కుదేలు

తడిసి మొలక వస్తున్న గింజలు

అవుకు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న పంటను సాగు చేసిన రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. వర్షాలతో నెల రోజుల వ్యవధిలోనే మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతింది. మొక్కజొన్న పంటకు గిరాకీ ఉండటంతో మండల వ్యాప్తంగా 5వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. ఎకరాకు రూ. 25వేలు ఖర్చు చేశారు. ఈసారి ప్రకృతి సహకరించపోవటంతో దిగుబడి ఎకరాకు 20 క్వింటాళ్లలోపే వచ్చింది. పంటను కోసి రోడ్ల పక్కన, కళ్లాల్లో ఆరబెట్టుకున్నారు. కురుస్తున్న వర్షంతో ధాన్యం తడవ కుండ ఉండటానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. టార్పాలిన్ పట్టలతో ధాన్యాన్ని కప్పి పెట్టారు. వర్షానికి ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటం రూ. 2,400 నిర్ణయించింది. తడిసిన ధాన్యాన్ని క్వింటం రూ. 1800 ప్రకారమైన కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదు. కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు కనిపించటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిసిన ధాన్యాన్ని కొనే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అవుకులో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు రమణ

రుద్రవరం: రుద్రవరం మండలంలో కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న, వేరుశనగ కాయలు మొలకెత్తాయని గురువారం రైతుల వాపోయారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు చేతికందిన పంట దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దకంబలూరు, వెలగలపల్లె, కోటకొండ, చిన్నకంబలూరు, కొండమాయపల్లె, రుద్రవరం గ్రామాల్లో రైతులు కుప్పలుగా పోసిన మొక్కజొన్నలు, వేరుశనగ కాయలు మొలకెత్తి నష్టపోయామని వాపోయారు.

పంట నష్టంపై నివేదికలు

రుద్రవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 రైతు సేవా కేంద్రాల పరిధిలో 770 ఎకరాల్లో మొక్కజొన్న పంట, 465 ఎక రాల్లో వరి పంట రైతులు నష్టపోయినట్లు నివేదికలు పంపినట్లు ఏవో సుమతి గురువారం తెలిపారు. గ్రామాల వారీగా ఏ రైతు ఎంత విస్తీర్ణం లో ఏయే పంటలు నష్టపోయారో వాటి వివరాలు వర్షం ఆగిన తర్వాత సేకరిస్తామన్నారు. రైతుల నుంచి సేకరించిన వివరాలు ఉన్నతాధికారుల కు పంపినట్లు ఏవో తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బేతంచెర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ గురువారం తెలిపారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని జడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీటీసీలతోపాటు సర్పంచులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖల అభివృద్ధి పనులపై చర్చించిస్తామన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

చాగలమర్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. చెస్, యోగా, అథ్లెటిక్స్, వాలిబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించినట్లు మండల విద్యా కో-ఆర్డినేటర్ దాదాపీర్ తెలిపారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జీవయ్య, జిల్లా కార్యదర్శి ఆశాజ్యోతి, పీడీ శ్రీనాథ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30 వేల ఎకరాల్లో పంట నమోదు

చాగలమర్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో 30 వేల ఎకరాల్లో పంట నమోదు చేసినట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 42 వేల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేయాల్సి ఉందని అన్నారు. ప్రతి సర్వే నంబర్‌ను నమోదు చేసి పంట వివరాలను నమోదు చేయాలని అన్నారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి అంచన వేస్తున్నా మని అన్నారు. ఈనెల 30వ తేదీ వరకు పంట నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మంజుల, రేవతి, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆళ్లగడ్డ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నూర్జాహాన్ గురువారం తెలిపారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం ఉంటుందని, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆమె కోరారు.

మందలూరులో కూలిన మట్టిమిద్దె

రుద్రవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలూరు గ్రామంలో గురువారం కురిసిన వర్షానికి పద్మావతి అనే మహిళకు చెందిన మట్టిమిద్దె కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

నాసిరకం మాంసం విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ హరిప్రసాద్

బేతంచెర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాంసం, చికెన్ దుకాణాల యజమానులు ప్రజలకు నాసిరకం మాంసం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో మాంసం షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలని సూచించారు. దుకాణాల పరిసరాల చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలను రోడ్లపై, కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని సూచించారు. చనిపోయిన జంతువుల మాంసం అమ్ముతున్నట్లు తమ దృష్టికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ సువర్ణలక్ష్మి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ చేయండి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో భాగ్యలక్ష్మి

రుద్రవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ చేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం రుద్రవరంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో తనిఖీ చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని బాలికల ఉన్నత పాఠశాల, సంతమార్కెట్ పాఠశాల, ముత్యాలపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాం పు కేంద్రాలను ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఎంఈవో అనూరాధ, ఈవో తారకేశ్వరి గురువారం తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ 5 సంవ త్సరాల నుంచి 15 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ ఆధార్ మానిటరీ బయోమెట్రిక్ నమోదు చేయడానికి కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులకు ఆధార్ ధృవీకరణ పత్రాలను అంద జేస్తామని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శివలక్ష్మీ, శేషాద్రి, సీనియర్ అధికారి బాలనరసింహుడు, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, షేక్షావలి, డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

పూజా సామగ్రి పంపిణీ

శిరివెళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పలు ఆలయాలకు ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరెడ్డి గురువారం పూజా సామగ్రి పంపిణీ చేశారు. గ్రామాల్లో ఆదరణకు నోచుకోని పలు ఆలయాలను గుర్తించి కార్తీక మాసంలో నిత్య పూజలు జరిగేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు సుబ్బరాయుడు, గోవిందు, నరసింహ, ఓబులేసు, సుబ్బారావు పాల్గొన్నారు.



పూజా సామగ్రి అందజేస్తున్న నాగమల్లేశ్వరరెడ్డి

బైక్‌ను ఢీకొన్న లారీ.. యువకుడికి తీవ్రగాయాలు

కొలిమిగుండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల సమీపంలోని నాయినిపల్లె రహదారిలో అక్కదేవతల గుడి వద్ద గురువారం ఉదయం ఓ లారీ అతి వేగంగా వెళుతూ అదుపు తప్పి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఈఘటనలో బైక్‌పై రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డు విధులకు హాజరవ్వడానికి వస్తున్న అవుకు మండలం జూనింతల గ్రామానికి చెందిన వడ్డె అనిల్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

వైభవంగా దీపోత్సవం



రామలింగేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చాగలమర్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర, భీమలింగేశ్వర, బుగ్గమల్లేశ్వర ఆలయాల్లో గురువారం కార్తీక శోభ సంతరించుకుంది. ఆలయాల్లో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించి దీపోత్సవ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శివపార్వతుల ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయాల అధ్యక్షులు భాస్క ర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మహిళలు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవ పుస్తకాల ఆవిష్కరణ: చాగలమర్రి గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవ పుస్తకాలను గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈనెల 22 నుంచి నవంబరు 18వ తేదీ వరకు కార్తీకమా సోత్సవాలు నిర్వహిస్తామని, ప్రతి రోజు అభిషేకాలు, దీపోత్సవం నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివనాగేంద్ర, ప్రసాద్, అమరేష్, రాజేంద్రప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి వీఆర్వోలను ఆదేశించారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని తహసీల్దరు కార్యాలయంలో వీఆర్వోలతో తహసీల్దారు సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లా డుతూ గ్రామాల్లో ప్రజలకు వీఆర్వోలు అందుబాటులో ఉండి సమస్య లను పరిష్కరించాలన్నారు.

సీజనల్ హాస్టల్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్యాపిలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామంలో ఏర్పాటు చేయనున్న సీజనల్ హాస్టల్ ఏర్పాటుకు ఎన్‌జీవో స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరనాయక్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ వసతి గృహం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ఎన్‌జీవో సంస్థలు ఈ నెల 26వ తేదీలోపు తమ దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో కోరారు.

విద్యావంతులుగా మార్చేందుకే 'అక్షరాంధ్ర'

కోవెలకుంట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ విద్యావంతులుగా మార్చేందుకే ప్రభుత్వం అక్షరాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసిందని ఎంపీడీవో వరప్రసాదరావు అన్నారు. గురువారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం శేఖర్ ఆధ్వర్యంలో నిరక్షరాస్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీడీవో వరప్రసాదరావు, ఎంఈవో వెంకటసుబ్బయ్య, నోడల్ అధికారి భాస్కరరెడ్డి, పర్యవేక్షకుడు ఫయాజ్‌లు హాజరై మాట్లాడారు. ఎల్‌సీ రవికుమార్, సీసీలు గోపాల్, రవికు మార్, నిర్మల, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

క్యూలైన్ ఏర్పాటు

బేతంచెర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన శైవ క్షేత్రమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి భ్రమరాంబ దేవి ఆలయంలో భక్తుల దర్శనార్థం రూ.60వేలతో క్యూలైన్ స్టీల్ గ్రిల్‌ను దాతలు గురువారం ఏర్పాటు చేశారు. బేతంచెర్ల పట్టణానికి చెందిన గ్రూపు దేవాలయాల మాజీ చైర్మన్ గూండా జగన్మోహన్‌రావు శ్యామల దంపతుల కుమారుడు గుండా అశ్వర్థ నారాయణ సతీమణి హిమబిందు ముచ్చట్ల మల్లికార్జున స్వామి దర్శనార్థం భక్తులకు క్యూలైన్ స్టీల్ గ్రిల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రశేఖర్ శర్మ దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.